పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శ

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మాడ్గులపల్లి, జూలై 14 : మండలంలోని కల్వలపాలెం గ్రామానికి చెందిన తిరుగుడు వెంకన్నయాదవ్, పాముల పాడు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బంటు సైదులు తండ్రి జానయ్య, సీతా కలమ్మ ఇటీవల మృతి చెందారు. కుటుంబసభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మాజీ సర్పంచ్ యాతం లక్ష్మీనరేందర్‌రెడ్డి, చింతచెర్వు జానయ్య, సీనియర్ నాయకులు పానుగోటి చొక్కారావు, నాంపల్లి జగన్, పానుగోటి మోహన్‌రావు, సుధాకర్‌రావు, చింతకాయల సైదులు, నరేష్, కుర్రి జగన్, చింతకాయల అంజయ్య, దిలీప్, రాంచంద్రు, నాంపల్లి గిరి పాల్గొన్నారు.

హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం

మాట్లాడుతున్న బీఎల్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ప్రసన్నకుమార్

మిర్యాలగూడటౌన్, జూలై 14 : అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో యోగా, ధ్యానం,ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్న హార్ట్‌ఫుల్ నెస్(శ్రీరామచంద్రమిషన్) సంస్థ సేవాలు అభినందనీయమని బీఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ చైర్మన్ ప్రసన్నకుమార్ అన్నారు.పట్టణంలోని షాబునగర్‌లో ఉన్న ఏఆర్‌సీ ఫంక్షన్‌హాల్‌లో రెండ్రోజులు నిర్వహించే వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సంస్థ వారు నియోజకవర్గంలో నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలకైనా తనవంతు సాయం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి పట్టణ పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

శివాంజనేయ లక్ష్మీనర్సింహ ఆలయంలో చోరీ

ఆలయంలోని బీరువా తాళాలను పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

కట్టంగూర్, జూలై 14 : కట్టంగూర్ శ్రీకృష్ణనగర్‌లోని శివాంజనేయ లక్ష్మీ నర్సింహ ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పూజారి నర్సింగోజు భిక్షమాచారి ఆదివారం ఆలయానికి వెళ్లేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో చూసి స్థానికులకు సమాచారం ఇచ్చారు. ఆలయంలోని రూ.25 వేల విలువ చేసే మైక్ సెట్‌తో పాటు బీరువా తాళాలు ధ్వంసం చేసి అందులోని కొన్ని అమ్మవారి పట్టుబీరెలు, పూజా సామగ్రి దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఎన్.శ్రీను పేర్కొన్నారు.

సాయి దత్త ఆశ్రమంలో లక్ష నామార్చన

లక్ష నామార్చన పూజలో పాల్గొన్న భక్తులు

మిర్యాలగూడ, జూలై 14: పట్టణంలోని రైల్వే కాలనీలో గల సాయిదత్త ఆశ్రమంలో సాయి లక్ష నామార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉదయం 5గంటలకు హారతితో ప్రారంభించి నాగసాయి విగ్రహానికి పంచామృతా భిషేకాలు నిర్వహించినట్లు చెప్పారు. అంతర్జాతీయ షిర్డీ భక్త సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష నామర్చన నిర్వహించినట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శులు నరేందర్, ఉపాధ్యక్షుడు ప్రతాప్, మట్టయ్య, సోమన్న, జగన్నాథరావు, జానకీరాముడు, రవి, నాగన్న, విక్రమ్, వెంకన్న, విజయ్, అంజి బాబు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

రామగిరి, జూలై 14: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. నల్లగొండలోని ఆఫార్టీ జిల్లా కార్యాలయం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాలలో నిరుపేదలు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో సక్రమంగా పనిచేయని డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి కోరారు. పార్టీ నాయకులు కెఎస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, విశ్వనాథుల లెనిన్,సత్యనారాయణ, సుజాత, కౌసల్య పాల్గొన్నారు.

నేరేడుగొమ్ములో 16న అభివృద్ధి పనులు ప్రారంభం

చందంపేట, జూలై 14 : నేరేడుగొమ్ము మండలం కేంద్రంలో కొత్తగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ మంగళవారం ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లోకసాని కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వానలు కురవాలని..

- గ్రామాల్లో బొడ్రాయికి జలాభిషేకం
- మరి కొన్ని పల్లెల్లో కప్ప కాముడు ఆట

కనగల్: దోరెపల్లిలో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నల్లగొండ రూరల్ : చిన్నసూరారంలో చెట్టు కింద వంట చేసుకుంటున్న గ్రామస్తులు

నల్లగొండ సిటీ, జూలై 14 :వర్షాలు కురవాలని కనగల్ దోరెపల్లిలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు కప్పకాముడు ఆడి, గ్రామ బొడ్రాయికి జలాభిషేకం చేశారు. అనంతరం వరద పాశం నిర్వహించారు. సందర్భంగా మహిళలు మాట్లాడుతూ వర్షాలు లేక పంటలు సాగుచేయలేదని భూములు పడావు పడ్డాయని అన్నారు. దాంతో వర్షాలు పడాలని కోరుతూ గ్రామ బొడ్రాయికి వరద స్నానం చేయించామని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్య, కడారి మల్లమ్మ, భిక్షమమ్మ, బైరగాని పద్మ, చంద్రకళ, గంగమ్మ, సంతు తదితరులు ఉన్నారు.

చిన్నసూరారంలో వనవాసం

నల్లగొండ రూరల్ : వర్షాలు కురువాలని పల్లెలు పచ్చగా మారాలని మండలంలోని చిన్న సూరారం గ్రామస్తులు ఆదివారం గ్రామాన్ని విడిచి వనవాసం వెళ్లారు. ఉదయానే ఇంటికి తాళాలు వేసి చెట్ల కిందకు వెళ్లి అక్కడే వంట చేసుకున్నారు. సాయంత్రం గ్రామానికి వచ్చి బొడ్రాయికి నీళ్లు పోసి నిప్పు తెచ్చుకొన్నారు. మండలంలోని జీ.చెన్నారం గ్రామంలో మహిళలు కప్ప కాముడు ఆడారు.

నిరుద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరపాలి : బీఆర్ఎస్‌వీ

మాట్లాడుతున్న రావుల గిరి గౌడ్

మర్రిగూడ, జూలై 14 : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులతో చర్చలు జరిపి వారి డిమాండ్‌లను పరిష్కరించాలని బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ కార్యదర్శి రావుల గిరి గౌడ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 10 రోజులుగా నిరుద్యోగులు నిరాహార దీక్షలు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రజా ప్రభుత్వం స్పందించకపోవడం బాధకరమన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులను రెచ్చగొట్టి ఓట్లేయించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు మొహం చాటేశాడని మండిపడ్డారు. డీఎస్సీని 3 నెలల పాటు వాయిదా వేసి 25 వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్-2,3 పోస్టులను పెంచాలని కోరారు. అక్రమ అరెస్టులు,లాఠీచార్జీలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఇలానే ఉంటుందని మరోసారి చూపిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వీరమల్ల శివగౌడ్, పంగ రాజుయాదవ్, పోకల గణేశ్, అనిమల్ల గణేశ్ పాల్గొన్నారు.

విశ్వకర్మ లెజెండ్ అవార్డు గ్రహీత సోముకు సన్మానం

సోమును సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ ప్రతినిధులు

రామగిరి, జూలై 14 : విశ్వకర్మ లెజెండ్ అవార్డు గ్రహీత పెందోట సోమును విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం నల్లగొండలో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోము విశ్వకర్మ తేజస్విని, హరిహర పుత్ర అయ్యప్ప సేవా సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అందోజు కృష్ణామాచారి, జిల్లా అధ్యక్షుడు అబ్బోజు మదనాచారి, ప్రధానకార్యదర్శి బొడ్డుపల్లి రామకృష్ణ, కోశాధికారి కాకునూరి జగదీశ్వరాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు అందోజు నర్సింహాచారి, గౌరవ సలహాదారుడు చౌడోజు సైదాచారి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

- డీఎస్పీ శివరాంరెడ్డి

యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ

నల్లగొండ సిటీ, జులై 14 :బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని డీఎస్పీ శివరాంరెడ్డి హెచ్చరించారు. నల్లగొండ పట్టణంలో శనివారం రాత్రి 7 నుంచి 11 గంటల వరకు వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో 14 బృందాలుగా ఏర్పడి స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. డ్రైవ్‌లో నంబర్‌ప్లేట్ లేని, ట్రిపుల్ రైడ్ కు చెందిన 80 వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 100 మందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వన్ టౌన్, టూటౌన్ సీఐలు డానీయల్,రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు నాగరాజు, శంకర్,శివకుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్


మల్లెలగట్టు కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న ఆనంద్

కొండమల్లేపల్లి, జూలై 14 : నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు కట్టించి ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలోని మల్లెలగట్టు కాలనీలో ప్రజలతో ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అవగాహన కల్పించారు.కొన్నేండ్లుగాకాలనీలో ప్రభుత్వ భూమిలో అప్పులు చేసి ఇండ్లు లేని గుడిసెలు వేసుకుంటే ఆక్రమ నిర్మాణాలంటూ గుడిసెలు తొలగించి వారిని రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుహాసిని, నాగమ్మ, గిరి, వెంకటయ్య పాల్గొన్నారు.

మొహర్రం సందడి

త్రిపురారం, జూలై 14: మండలంలోని అప్పలమ్మగూడెం, రాగడప, పెద్దదేవులపల్లి, త్రిపురారం గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి యువకులు అలావ్ చుట్టు నృత్యాలు చేయడంతో మొహర్రం వేడుక ప్రారంభమైంది. తెల్లవారుజామునే పీర్లు తీసుకోని ఆయా గ్రామస్తులు గ్రామాల్లోని పురః వీధుల్లో ఊరేగింపుగా తిరిగారు. ఐదు రోజులపాటు జరిగే ఈ మొహర్రం వేడుకలు బుధవారం పూర్తవుతాయని ఆయా గ్రామాల పూజారులు తెలిపారు.

అప్పలమ్మగూడెంలో పీర్లు ఊరేగిస్తున్న గ్రామస్తులు

నేటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాల్, జూలై 15: చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సోమవారం నిర్వహించనున్న మెగా వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో హైదరాబాద్ బీఎన్‌రెడ్డి లోని నీలాద్రి , మాల్‌లోని పద్మావతి ఆస్పత్రి వైద్యులతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి అరికట్టడంలో అధికారులు విఫలం :ఏఐవైఎఫ్

మునుగోడు, జూలై 14 : మండల కేంద్రంలో గంజాయి అరికట్టడంలో పోలీస్, పంచాయతీ అధికారులు విఫలమయ్యారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఆరోపించారు. మండల కేంద్రంలో సీపీఐ పట్టణ నిర్మాణ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 15ఏండ్ల పైబడిన విద్యార్థులు, యువత గంజాయి, కొకెన్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి మత్తులో మునిగి పోతున్నారని తెలిపారు. పట్టణ శివారు ప్రాంతాల్లో యువత బైకులపై తిరుగుతూ మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వీరిపైన పోలీసులు గట్టి నిఘా పెట్టాలన్నారు. ఎండీ జానీ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో నాయకులు సురిగి చలపతి,చాపల శ్రీను, దుబ్బ వెంకన్న, రేవెల్లి అంజయ్య, పాలకూరి యాదయ్య, దుబ్బ సైదులు పాల్గొన్నారు.

గోపలాయపల్లి గుట్టపై నేటి నుంచి రుద్రయాగం

నార్కట్‌పల్లి జూలై 14 : మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి గుట్టపై సోమవారం నుంచి ఈ నెల 21 వరకు సుదర్శన యాగసంహిత రుద్ర యాగం, శ్రీ కృష్ణ యజుర్వేద క్రమస్వస్తి పూర్వక సంపూర్ణ వేద పారాయణం, ఋగ్వేద పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి దివ్య ఆశీస్సులతో నిర్వహించే కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు.

బీటీ రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

రోడ్డు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

మునుగోడు, జూలై14 : మునుగోడు నుంచి నల్లగొండకు వెళ్లే ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డు ఇటీవల గుంతల పడి అధ్వానంగా తయారైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రోడ్డు మరమ్మతులకు పీరియాడికల్ రెన్యువల్ నిధులు రూ. 90 లక్షలు మంజూరుచేయించారని అధికారులు తెలిపారు దీంతో మరమ్మత పనులను ప్రారంభించారు.

అయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి

'ఆయిల్ పామ్ సాగుతో అధికాదాయం'

మాడ్గులపల్లి, జూలై 14: రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసుకుంటే అధిక దిగుబడి, ఆదాయం సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి తెలిపారు.మండలంలోని పూసలపాడు గ్రామం లో ఆదివారం జొన్నలగడ్డ రఘునాథరెడ్డి, బత్తుల చిన్నవెంకటయ్య వ్యవసాయ క్షేత్రం లో ఆరు ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో 204 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ సంవత్సరం వెయ్యి ఎకరాల్లో మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో సుధాకర్, కోటేశ్, బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

శాసన మండలి చైర్మన్ గుత్తాను కలిసిన ఎస్పీ

నల్లగొండ రూరల్,జూలై 14: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎస్పీ శరత్ చంద్ర పవార్ నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు.

నిరుపేద కుటుంబంలో విద్యాకుసుమాలు

- ఒకే ఇంట్లో అక్క, తమ్ముడికి పలు ప్రభుత్వ కొలువులు
- ఒక్కొక్కరికీ ఐదేసి ఉద్యోగాలు

రమేశ్

ఉమా

శాలిగౌరారం, జూలై 14: ప్రస్తుతం ఉన్న పోటీ రంగంలో ఒక్కే ఒక్క ఉద్యోగం కొట్టాలంటే ఎంతో కష్టపడి చదివితే గానీ కొలువు వచ్చే విధంగా లేదు. కానీ శాలిగౌరారం మండలం తిర్మలరాయినిగూడెం గ్రామానికి అక్క, తమ్ముడు ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

తిర్మలరాయినిగూడెం గ్రామానికి చెందిన వాడపల్లి పెద్ద లింగయ్య, పూలమ్మ దంపతులది నిరుపేద కుటుంబం పూలమ్మ రోజు కూలీ, లింగయ్య మత్స్యకార్మికుడు. అయినా కూతురు ఉమా, కుమారుడు రమేశ్‌ను కష్టపడి ఉన్నత చదువులు చదివించారు. వారు కూడా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగా చదివి ఒక్కొక్కరు రెండు నుంచి ఐదేసి ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపి కయ్యారు. వీరిద్దరి ప్రాథమిక విద్య గ్రామంలో కొనసాగింది. 6 నుంచి 10 వరకు శాలిగౌరారం జడ్పీ హైస్కూల్‌లో పూర్తి చేశారు. అనంతరం నకిరేకల్, నల్లగొండ పట్టణాలకు ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఉమా బీఎడ్, పీజీ 2022లో పూర్తి చేయగా రమేశ్ కూడా బీటెక్ ఎలక్ట్రికల్ 2021లో పూర్తి చేశాడు. అయినా ప్రభుత్వం కొలువు సాధించాలనే తపనతో గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకొని పలు ఉద్యోగాలు సాధించారు. ఉమా 2023 ఆగస్టులో కస్తూర్బా గాంధీ పాఠశాలలో టీచర్ ఉద్యోగం సాధించి విధులు సైతం నిర్వర్తిస్తుంది. అనంతరం విడుదలైన గురుకుల ఫలితాల్లో పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్‌కు ఎంపిక య్యారు. జూనియర్ లెక్చరర్‌లో మహిళా కోటాలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు, జనరల్ కోటాలో 11వ ర్యాంకు సాధించినప్పటికీ అధికారికంగా ప్రకటించాల్సి ఉందని ఉమా తెలిపారు. తల్లిదండ్రులతో పాటు తన భర్త బొల్లెపల్లి నాగరాజు ప్రోత్సాహంతోనే ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. రమేశ్ కూడా ఇంటెలిజెన్స్ బ్యూరోలో (జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్)జెఐఓ-2 టెక్నికల్ జనవరి 2024లో ఉద్యోగం సాధించాడు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ)ఐ@క్యాడ్ ఎలక్ట్రికల్ ఉద్యోగానికి జూన్ 2024న ఎంపి కయ్యాడు. అసిస్టెంట్ ఇంజినీర్ ఏఈఐ@క్యాడ్‌లో స్టేట్ 9వ ర్యాంకు, పాలిటెక్నిక్ లెక్చరర్ స్టేట్ 10వ ర్యాంకు, గ్రూప్-4లో స్టేట్ 108 వ ర్యాంకు సాధించినప్పటికీ అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నట్టు రమేశ్ తెలిపారు. వీరిద్దరూ ప్రభుత్వ కొలువులు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్సీ భవనం ఎంఈఓకు అప్పగింత

ఎంఈఓ మాత్రునాయక్‌కు ఎమ్మార్సీ భవన పత్రాలను అందిస్తున్న కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు

కొండమల్లేపల్లి, జూలై 14: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనాన్ని ఇన్‌చార్జి ఎంఈఓ మాతృనాయక్‌కు కాంట్రాక్టర్ కాసర్ల వెంకటేశ్వర్లు అప్పగించారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో ఆదివారం 'నిరుపయోగంగా ఎమ్మార్సీ భవనం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దాంతో అధికారులు స్పందించి ఎమ్మార్సీ భవన పత్రాలను ఇన్‌చార్జి ఎంఈఓ మాతృనాయక్ అప్పగించారు. ప్రాథమిక పాఠశాల నుంచి భవనానికి నీటి వసతి కల్పిస్తున్నామని, పెండింగ్ పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భవనానికి ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే బాలూనాయక్‌తో సానుకూలంగా స్పందించారని త్వరలో నిర్మాణం చేపడుతామని చెప్పారు.

కన్నెకల్‌లో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాడ్గులపల్లి, జూలై 14: మండలంలోని కన్నెకల్ గ్రామంలో ప్రజలు 25 రోజులుగా విష జ్వరాల బారిన పడుతూ ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ఆదివారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'కన్నెకల్‌లో విష జ్వరా లు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన వైద్యులు ఆదివారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిడమనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవకుమార్ మాట్లాడుతూ ప్రజలు జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతుండడంతో ఇంటింటి సర్వే నిర్వహించి వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. గ్రామంలోని రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. దోమల నివారణకు గ్రామంలో ఫాగింగ్ చేపట్టాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కిరిబాయి, జోసఫ్, భవాని, జ్యోతిక, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- నందికొండలో ముగ్గురికి రిమాండ్
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నందికొండ, జూలై 14 : జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు, చైన్ స్నాచింగ్ చేసే ముఠాను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నందికొండ విజయపురి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. ఈ నెల 4న నాగార్జునసాగర్ హిల్ కాలనీకి చెందిన రూప ఉపాధ్యాయురాలు పెద్దవూర నుంచి విధులు ముగించుకొని బైక్‌పై వస్తుండగా బైక్‌పై వచ్చిన యువకులు ఆమె మెడలో బంగారు గొలుసును దొంగలించి పరాయ్యారు. రూప ఫిర్యాదు మేరకు సీఐ బీసన్న విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం హిల్‌కాలనీలోని సీఐ, ఎస్ఐ సంపత్ గౌడ్ వాహనాలు తనిఖీ చేస్తుండగా హాలియా మున్సిపల్ పరిధిలోని ఇబ్రహీంపేటకు చెందిన బాలుడు తన స్నేహితుడు కుంచాల వేణుతో కలిసి బైక్‌పై అనుమానాస్పందంగా వెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారు ఫోన్లు దొంగతనాలు చేసి ఇబ్రహీంపేటకు చెందిన గొట్టిముక్కల శ్రీనివాస్ చారికి విక్రయిస్తే వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవ